క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



నవోదయకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఆస్పరి సీఐ హనుమంతప్ప

ఆస్పరి: నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఆస్పరి మండల విద్యార్థులు ప్రతిభ చూపడం అభినందనీయమని ఆస్పరి సీఐ హనుమంతప్ప అన్నారు. ఆస్పరిలో సోమవారం నవోదయకు ఎంపికైన విద్యార్థులు అబ్దుల్ ఆజీజ్, నాని, ధర్మతేజ, చరితలను సీఐ హనుమంతప్ప మెమెంటోలు ఇచ్చి అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి పెద్దలను గౌరవించి, క్రమశిక్షణ చదువుతూ ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు.

బండగట్టు పైప్‌లైన్ లీకేజీ



కనకదిన్నె బ్రిడ్జి వద్ద పైకి ఎగజిమ్ముతున్న నీరు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కనకదిన్నె గ్రామంలోని బ్రిడ్జి సమీపంలో బండగట్టు పైప్‌లైన్‌కు సోమవారం లీకేజీ ఏర్పడింది. దీంతో పైప్ నుంచి నీరు ప్రధాన రోడ్డులో బ్రిడ్జిపైకి ఎగజిమ్ముతూనే ఉంది. అసలే మండు వేసవి. పలు గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొన్న తరుణంలో ఇలా నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీకి బుద్ధి చెప్పడం ఖాయం



రామాంజనేయులు

ఆలూరు: వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఇంటి వద్ద పింఛన్ అందకుండా, మండు వేసవిలో వారు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి కల్పించి అవస్థలకు గురిచేస్తున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులకు పింఛనుదారులు ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయమని ఆలూరు మండలం వికలాంగుల సమైక్య సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో క్రమం తప్పకుండా ప్రతి నెల 1 తేదీన లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందుతోందని వివరించారు. ప్రస్తుతం టీడీపీ కుట్రలతో పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పింఛన్ల పంపిణీకి అడ్డంకులు సృష్టించి, మళ్లీ సీఎస్ డాక్టర్ జవహర్ రెడ్డిని కలిసి ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయాలంటూ టీడీపీ నేతలు వినతి పత్రాన్ని అందజేయడం దారుణమని పేర్కొన్నారు. టీడీపీ కుట్రలు, కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య



విజయ్‌కుమార్ (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన యువ రైతు ముత్యాల విజయ్‌కుమార్ (32) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. చందోలి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ వారికున్న నాలుగు ఎకరాల నలభై సెంట్ల పొలంలో కంది, సద్ద పంటలు సాగుచేశాడు. గ్రామంలోని వ్యక్తుల నుంచి తీసుకున్న అప్పులు సుమారు రూ.6 లక్షల వరకు ఉన్నాయి. వానలు లేక సరిగా దిగుబడి రాకపోవడంతో సాగుకు, కుటుంబ ఖర్చుల కోసం తెచ్చుకున్న అప్పులు ఎలా తీర్చాలో అన్న బెంగతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పింఛన్ల పంపిణీ ఆంక్షలపై పునరాలోచించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ టీ.నసురుద్దీన్

గోనెగండ్ల: పింఛన్ల పంపిణీ విషయంలో వలంటీర్లపై విధించిన ఆంక్షలపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలని ఎంపీపీ టీ.నసరుద్దీన్ కోరారు. సోమవారం గోనెగండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ, సంక్షేమ పథకాలను దరఖాస్తులు వంటి కార్యక్రమాలు ఎప్పటి నుంచో అమలులో ఉన్నందున ఎన్నికల నిబంధనలు వర్తింపజేయకుండా చూడాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆంక్షలతో లక్షలాది మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలంటీర్లు పింఛన్ల పంపిణీపై వచ్చిన ఫిర్యాదులు కేవలం రాజకీయ ప్రేరేపితమన్నారు. వలంటీర్లు పారదర్శకంగా సేవలందిస్తున్నారని, దీంతో ఓర్వలేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. అలాంటి వారి ఫిర్యాదులు పరిగణనలోకి తీసుకోవద్దని కోరారు.

పింఛన్ సొమ్ముతో జీవనం



ఈ వృద్ధురాలి పేరు సారంజి. గోనెగండ్లలోని బగిలి వీధిలో కూతురితో కలిసిఉంటూ ప్రతి నెలా వచ్చే రూ.3 వేల పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తోంది. ఈమె వయసు 80 ఏళ్లు. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో కాళ్లకు ఆపరేషన్ చేయించుకుంది. అప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. ఈమె కూతురు చాంద్‌బీకి కూడా వితంతు పింఛన్ వస్తుంది. కూతురికి అప్పుడప్పుడు మతిస్థిమితం సరిగా ఉండదు. ఇంట్లో వీరిద్దరే ఉంటారు. నానా ఇబ్బందులు పడుతున్న వీరికి ప్రతినెలా వలంటీర్ అందించే పింఛన్ సొమ్మే ఆధారం. యథావిధిగా ఈనెలా పింఛన్ వస్తుందని గంపెడాశతో ఎదురుచూస్తున్న వీరికి వలంటీర్ రాడన్న విషయం తెలిసి ఆవేదనకు గురవుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న నేను కార్యాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకోలేను, కుమార్తెకు మతిస్థిమితం బాగుండదు. మాలాంటోళ్ల కోసమైనా ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేయాలి.

– గోనెగండ్ల

నా వల్ల కాదు నాయనా..



'ఏంది.. పింఛన్ డబ్బులు ఇంటికి తెచ్చి ఇయ్యరా.. వలంటీర్‌ను ఒద్దన్నారా.. నేను యాడికో పోయి తెచ్చుకోవాల్న.. చంద్రబాబు టైంల శానా కష్టపడి రచ్చకట్ట కాడికి పోయి ఎదురుసూసి సూసియా మాపటేలకో తెచ్చుకునేదాన్ని.. నా మనుమడు వైఎస్ జగన్ వచ్చినాక వలంటీర్ పొద్దున్నే నిద్ర లేపి మరీ పింఛన్ ఇచ్చి పోతున్నాడు. ఇప్పుడు నాకు 87 ఏళ్లు. పదడుగులు కూడా వేయలేను.. సచివాలయానికి పోయి పింఛన్ తెచ్చుకోవాలంటే నాతో కాదు నాయనా.. వలంటీర్ ప్రతి నెలా కరెక్టుగా ఇంటికి వచ్చి రూ.3 వేలు పింఛన చేతిలో పెట్టి పోతుండె.. ఆ చంద్రబాబు అడ్డమేసినాడంటే కోపమొస్తుంది.. ఆయనకు ఎవరైనా బుద్ధిసెప్పి ఇంటికాడికే పింఛన్ తెచ్చి ఇచ్చేలా పుణ్యం కట్టుకోవాలి'

– వెల్దుర్తి(కృష్ణగిరి)

- పింఛన్ల పంపిణీపై టీడీపీ నీచ రాజకీయాలు
- వలంటీర్లచే పంపిణీని అడ్డుకున్న వైనం
- మండుటెండలో దివ్యాంగులు, వృద్ధులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి
- చంద్రబాబు హయాంలో పింఛన్ కష్టాలను తలుచుకుంటూ ఆవేదన

పండుటాకులపై పగ.. వలంటీర్లపై విద్వేషం

ఆలూరు రూరల్/ఆస్పరి/ఎమ్మిగనూరురూరల్/కృష్ణగిరి/హొళగుంద: ప్రతినెలా ఒకటో తేదీన తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వృద్ధుల మోములో చిరునవ్వు నింపుతోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. ఇది చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని అక్కసు వెళ్లగక్కింది. స్వచ్ఛంద సంస్థ ముసుగులో అనుకూల వ్యక్తులతో.. వలంటీర్లచే ఇంటింటికీ పింఛన్ పంపిణీని అడ్డుకుని నీచ రాజకీయాలు చేస్తోంది. దీంతో ప్రతి నెలా ఇంటి ముందు కూర్చొని ఎదురుచూసే వృద్ధులు, దివ్యాంగులకు మూడు నెలల పాటు వలంటీర్ కనిపించడు. కాళ్లు కదపలేని దివ్యాంగులు, కొంచెం కూడా నడిచి వెళ్లలేని వృద్ధులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లక తప్పదు. తమ వంతు వచ్చే వరకు నిరీక్షించక తప్పదు. దీంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర సామాజిక పింఛన్ లబ్ధిదారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ దశల వారీగా రూ.3 వేలకు పెంచారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పింఛన్లు పంపిణీ చేశారు. గతంలో రోజుల తరబడి క్యూలైన్లో నిలబడి పింఛన్ తెచ్చుకునే పరిస్థితికి స్వస్తిచెప్పడం, ఇంటి తలుపుతట్టి పింఛన్ ఇవ్వడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ లబ్ధిదారులంతా సీఎం జగన్‌కు అండగా ఉంటారనే అక్కసుతో చంద్రబాబు కుట్రలకు పదునుపెట్టారు. చివరకు వలంటీర్లచే ఇంటి వద్దకు పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 34,902 మంది పింఛన్ దారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ప్రతి నెలా పింఛన్ నగదు అందిస్తోంది.





సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

3 నుంచి సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

తుగ్గలి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుగుణంగా పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు, డేటా రికార్డులు, డివైజ్‌లను స్వాధీనం చేసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. పింఛన్‌దారులందరూ గ్రామ సచివాలయాల వద్ద సిబ్బంది ద్వారా పింఛన్లు పొందాలన్నారు.

పనులు మానుకొని వేచి ఉండాలి



రోజు కూలీకి వెళ్తే గాని నా కుటుంబం గడవదు. ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నాను. ఎప్పటిలా ఈ నెల పింఛన్ వస్తుందగా ఆశగా ఎదరుచుశాను. ఈ సారి వలంటీర్ పింఛన్ ఇవ్వడని ఇరుగుపొరుగు వారు చెప్పారు. సచివాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలన్నారు. గతంలో మాదిరిగా పని మానుకుని రోజంతా వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

– ఫాతిమా, వితంతువు, ఆలూరు

ఆ తిప్పలు మాకొద్దు



గతంలో పింఛన్ కోసం పడ్డ అవస్థలు, పడిగాపులు మాకొద్దు. వృద్ధాప్యంతో నడవలేని స్థితిలో ఉన్న వారి కోసమే సీఎం జగన్ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపుతున్నారు. జగన్ చేసిన మంచి పనిని కొనసాగించాలి. సచివాలయం వద్ద లైన్‌లో ఎండకు నిలబడి నిరీక్షించే పరిస్థితి మాకొద్దు. – శేషమ్మ, సిద్దాపురం

వృద్ధులపై కక్ష సాధింపు



చంద్రబాబునాయుడుకు వృద్ధులపై కక్ష సాధింపు ఎందుకు. నాకు పింఛన్‌కు అర్హత ఉన్నా చంద్రబాబు పాలనలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. నాయకులు, అధికారులు చుట్టు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నాకు పింఛన్ మంజూరైంది. ఎలాంటి ఆస్తిపాస్తి లేని ఒంటరి వ్యక్తి అయిన నాకు పింఛన్ డబ్బులు ఎంతో అవసరం. చంద్రబాబు కుట్రలతో ఈ సారి వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయడానికి రాలేదు. 1వ తేదీ పింఛన్ రాకపోతే మాలాంటి వారికి ఎన్ని ఇబ్బందులు ఉంటాయో తెలుసా. – షేక్ బాషా,

బనవనూరు గ్రామం. ఆస్పరి మండలం

సచివాలయం వరకు వెళ్లలేను



ప్రతి నెలా ఇంటి దగ్గర తీసుకునే పింఛన్ కోసం ఈ నెల సచివాలయం వద్దకు వెళ్లాంటే ఇబ్బందిగా ఉంది. గత టీడీపీ పాలనలో ప్రతి నెలా పింఛన్ కోసం పంచాయితీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత ఆ బాధ తప్పింది. మళ్లీ మాలాంటి వృద్ధులు మండుటెండలో పడిగాపులు కాసేలా చేయడం చంద్రబాబుకు మంచిది కాదు. మాలాంటి వారి ఉసురు తగులుతుంది.

– అంజినమ్మ బిల్లేకల్లు గ్రామం,
ఆస్పరి మండలం

మళ్లీ పాత కష్టాలేనా ?



ఇన్నాళ్లు వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు చేతికిచ్చేవాడు. ఎక్కడికెళ్లేది లేదు. ఎలాంటి కష్టం రాలేదు. ఇప్పుడు ఉన్నట్టుండి వలంటీర్ రాడు పింఛన్ కావాలంటే సచివాలయం వద్దకు వెళ్లాలంటున్నారు. ముసలోళ్లం.. అంత దూరం నడవలేం. మళ్లీ పాత కాలం లాగా ఆఫీసుల ముందు పడిగాపులు కాయాలంటే వణుకు వస్తుంది. బాగా పని చేస్తున్న వలంటీర్లను వద్దనడం మంచిది కాదు. ఇంటివద్దకే పింఛన్ అందించాలి.

– వడ్డె సంజీవమ్మ, హొళగుంద

దివ్యాంగులు ఎలా వెళ్తారు



నడవలేని స్థితిలో ఉన్న నాకు వలంటీర్ ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందచేసేవాడు. దివ్యాంగురాలిని కావడంతో కాలకృత్యాలకు వెళ్లేందుకు కూడా ఇతరులపై ఆధారపడాలి. అలాంటిది పింఛన్ కోసం మండుటెండలో సచివాలయంకు ఎలా వెళ్లాలి. ఎవరోఒకరు దయదలచి సచివాలయం వరకు తీసుకెళ్తే తప్పా వేరే గత్యంతరం లేదు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ వద్దన్న వారు ఇక్కడికి వచ్చి చూస్తే మా పరిస్థితి అర్థం అవుతుంది. – మాణిక్యమ్మ,

బనవాసి, ఎమ్మిగనూరు మండలం

మాలాంటి వారికి దిక్కెవరు



వలంటీర్ల వ్యవహారంలో ఎన్నికల సంఘం నిర్ణయం సరైంది కాదు. పుట్టుకతోనే వికలాంగత్వంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్న నాకు ఐదేళ్లుగా ఇంటి వద్దనే పింఛన్ అందించారు. ఇప్పుడు మళ్లీ ఐదేళ్ల కిందట ఉన్న పరిస్థితికే తీసుకొచ్చారు. ఇలా చేయడం వల్ల వారికి ఏమొస్తుంది. గ్రామానికి నాలుగు కి.మీ దూరంలో సచివాలయం ఉంది. ఇంటి నుంచి బయటకు పోలేని నాలాంటి దివ్యాంగులు సచివాలయం వద్దకు వెళ్లగలరా?

– కుసున్నూరు నడిపి లింగడు, దివ్యాంగుడు,
రామకృష్ణాపురం

మంచానికి పరిమితమైనోళ్ల గోడు పట్టదా



మంచానికే పరిమితమైన మాలాంటి వారికి ఉన్నచోటికే వచ్చి పింఛన్లు ఇస్తున్న వలంటీర్లను వద్దనడం మంచిది కాదు. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలంటేనే భయం వేస్తుంది. ఎండలకు గంటల తరబడి వేచి ఉండలేం. నడవలేని స్థితిలో ఉన్న నాలాంటి వారి గోడును ఎన్నికల కమిషన్ అర్థం చేసుకోవాలి. పింఛన్ కోసం గతంలో పడిన కష్టాలు మళ్లీ ఇప్పుడు పడాల్సిందేనా?

– ఈశ్వరమ్మ, మల్కాపురం

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి

చిప్పగిరి: పెద్దహోతూరు గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 45 కుటుంబాల వారు సోమవారం ఆ పార్టీలను వీడి ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చిప్పగిరిలోని స్వగృహంలో ఆయన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. పార్టీ చిప్పగిరి కన్వీనర్ మారయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిత్తులమారి చంద్రబాబుకు బుద్ధిచెప్పాలి

చిప్పగిరి: జిత్తులమారి చంద్రబాబు పొత్తులను తిప్పికొట్టి ప్రజా సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. సోమవారం చిప్పగిరి ఎస్సీ, బీసీ కాలనీలలో ఆయన పర్యటించారు. జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాలు అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులకు తెర లేపారని, పార్టీలన్ని ఏకమై వచ్చినా జగనన్న విజయాన్ని ఆపలేరన్నారు. మ్యానిఫెస్టోను గాలికి వదిలేసిన చంద్రబాబుకు పింఛనుదారుల కష్టాలు ఎలా అర్థమవుతాయని వృద్ధులు, దివ్యాంగుల ఉసురు తగులుతుందన్నారు నాయకులు జూటూరు మారయ్య, గోవిందరాజులు, సురేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

తుగ్గలి: తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం దేశాయ తండాలో పర్యటించి తాగునీటి ఎద్దడి సమస్యను తెలుసుకున్నారు. మంగళవారం నుంచి దేశాయతండ, చిన్నజొన్నగిరిలో నీటి సరఫరాకు మంచినీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇంకా ఎక్కడైనా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ట్యాంకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్రమణలు అరికట్టాలి

మద్దికెర: స్థానిక సాయినగర్‌లో కమ్యూనిటీ ప్రయోజనాల కోసం వదిలిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని, ఆక్రమణలను అడ్డుకోవాలని కోరుతూ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం మండల పరిపాలన అధికారి ఇన్‌చార్జి కార్యదర్శి స్వర్ణలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ ప్రజల ఉపయోగార్థం ప్రభుత్వం 36 సెంట్లు కేటాయించడం జరిగిందన్నారు. గతంలో కూడా స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆ స్థలంలో పట్టాలు ఇవ్వరాదని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఏఓ మాట్లాడుతూ.. ఎవరైనా స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కాలనీవాసులు వేణుగోపాల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



బుక్కాపురంలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): పేదల గడప గడపకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే, సౌకర్యాల కల్పన మెరుగుపడాలంటే మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటెయ్యాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజలను కోరారు. ఆమె సోమవారం మండల పరిధిలోని బుక్కాపురం, కృష్ణాపురం, రామళ్లకోట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల కూడళ్లలో ఓపెన్‌టాప్ జీపు నుంచి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కంటే మంచి మెజారిటీ అందించాలని ప్రజలను విన్నవించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీఇచ్చారు. దళితులంటే, బీసీలంటే హేళన చేస్తున్న చంద్రబాబుకు ఎన్నికల్లో మరింత గట్టిగా బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాష, శంకర్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, చిన్న దస్తగిరి, గోపాల్ రెడ్డి, నాగేశ్వరరావు, ఎల్లస్వామి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆలూరుకు కలెక్టర్ రాక

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం నియోజకవర్గ ఎన్నికల అధికారుల సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన హాజరుకానున్నట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ సోమవారం తెలిపారు. సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఉదయం 9:20 గంటలకు హాజరుకావాలని ఆర్‌ఓ సూచించారు.

కార్యకర్తలతో సమావేశం

దేవనకొండ: మండలకేంద్రంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బుసినె వెంకటేష్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, ఆలూరు ఎమ్మెల్యేగా బుసినె విరూపాక్షిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన బోయ మునెప్ప కర్ణాటక మద్యాన్ని తలిరలిస్తుడంగా పట్టుకున్నామని తెలిపారు. కర్ణాటక మద్యం 480 జాన్స్ ఒరిజినల్ చాయస్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. తనిఖీలో ఏఎస్‌ఐ ఆనంద్, పోలీసులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారంలో తలారి వెంకటేష్, బోయ బడేసాబ్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లను ములుగుందం రోడ్డులోని బ్రహ్మయ్య దేవాలయం సమీపంలో విక్రయిస్తుండగా సోమవారం సాయంత్రం సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. వారి నుంచి 35 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

- సేవలు వద్దనడంపై మనస్తాపం
- వెల్దుర్తి మండలంలో 94 మంది రాజీనామా



ఎంపీడీఓ శివశంకరప్పకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వెల్దుర్తి వలంటీర్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో సోమవారం 76 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలలో తమ వ్యక్తిగత కారణాలుగా పేర్కొంటూ పత్రాలను ఎంపీడీఓ శివశంకరప్పకు సమర్పించారు. చెరుకులపాడు సచివాలయ పరిధిలోని చెరుకులపాడుకు చెందిన 13 మంది, కొసనాపల్లెకు చెందిన ఐదుగురు, వెల్దుర్తి పట్టణంలోని మూడు సచివాలయాలకు చెందిన 76 మంది రాజీనామా సమర్పించిన వారిలో ఉన్నారు. వారు మాట్లాడుతూ.. తాము నాలుగేళ్లకు పైగా గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా, నిస్వార్థంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తూ, ప్రభుత్వం సూచించిన ప్రతి పనిని పార్టీలకతీతంగా బాధ్యతగా నెరవేర్చామన్నారు. కరోనా విపత్కర సమయంలోనూ, ప్రజలు అనారోగ్య పరిస్థితులలో ఉన్నా చికిత్స అందేలా చర్యలు తీసుకుంటూ సేవలు చేశామన్నారు. టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఆ పార్టీల నాయకులు తమను పలుసార్లు నిందించినా, దేశద్రోహులు, నేరగాళ్లు అంటూ అవమానించినా తమ సేవలు మానుకోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమంటూ తమను మరింత అవమానపరుస్తూ, సేవలు అందించరాదంటూ ఇచ్చిన ఆదేశాలు తమను మరింత వేధించాయని, తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామా చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాజీనామా పత్రాలను ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పత్తికొండలో 16 మంది రాజీనామా

పత్తికొండ రూరల్: పత్తికొండ మండల పరిధిలోని దేవనబండలో 11 మంది, చిన్నహుల్తికి చెందిన ఐదుగురు వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామా చేసి పత్రాన్ని ఎంపీడీఓ రామారావుకు అందజేశారు. ప్రభుత్వం తరఫున సేవల్లో అంతర్యాగంగా ఇన్నాళ్లు అంకితభావంతో సేవలందించాం. సొంత గ్రామంలోనే సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. కానీ రాజకీయ పార్టీలు మాపై పగబట్టినట్లుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి మాపై చేస్తున్న దుష్ప్రచారాన్ని భరించలేక రాజీనామా సమర్పిస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు.

సేవ చేయొద్దనడంతో మనస్తాపం



తమను వలంటీర్లుగా ప్రభుత్వం తగు అర్హతలతో, ఇంటర్వ్యూలు చేసి మరీ నియమించింది. నాటి నుంచి నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతో నిస్వార్థంగా పార్టీలకతీతంగా ప్రభుత్వ ఆదేశానుసారం సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించాం. సేవ చేస్తున్నామన్న సంతృప్తి చెందాం. ప్రతిపక్షాలు, ఇతరుల ఫిర్యాదులతో తమను సేవ చేయడానికి వీల్లేదంటూ తప్పించడంతో మనస్తాపం చెంది రాజీనామా చేశాం.

–మధు, వలంటీర్, వెల్దుర్తి

అవమానాలు దిగమింగి పనిచేశాం



వలంటీర్లు దేశద్రోహులు, నక్సలైట్లు అంటూ, చివరకు కుటుంబాలను నాశనం చేస్తున్నారంటూ టీడీపీ, జనసేన నాయకులు చేసిన తప్పుడు ఆరోపణల కారణంగా అవమానాలు దిగమింగుతూ మా సేవలు కొనసాగించాం. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలు చేరుస్తూ తగిన వైద్య సేవలు, మందులు అందిస్తూ వారి ఆరోగ్యానికి అండగా నిలిచాం. నేడు తమను సేవలు చేయొద్దంటే మేము కొనసాగి అర్థమేముంటుంది. అందుకే రాజీనామా చేస్తున్నాం.

– కాంతారెడ్డి, వలంటీర్, వెల్దుర్తి

విగ్రహ ప్రతిష్ఠాపన

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ దేవమూర్తులు, ధ్వజ స్తంభ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నూతన విగ్రహాలకు జల, ధాన్య, యాజ్ఞహోమాలతో విశిష్ట పూజలు గావించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.